# మాస్టర్ సి.వి.వి.
# యోగము - కర్మరాహిత్యము

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంధకర్తవి, ప్రచురణకర్తవి.

ప్రథమ ముద్రణ : మే కాల్ డే, 2004.

ద్వితీయ ముద్రణ : మాస్టర్ సి.వి.వి. యోగ శతాబ్ది, 2010.

ప్రతులు : 1,000

అన్ని హక్కులు గ్రంథకర్తవి.

వెల : రూ॥ **10-00**

ప్రాప్తిస్థానము :
జగద్గురు మందిరము
(ది వరల్డ్ టీచర్ టెంపుల్)
'రాధామాధవమ్', 14-38-2, ముప్పిడి కోలనీ,
విశాఖపట్నం - 530 002.

ముద్రణ :
♒ ఎక్వేరియన్ ప్రింటింగ్ స్కూల్
విశాఖపట్నం – 530 016.
☏ 2747320, 9848075132.

# ధనిష్ఠ

"ధనిష్ఠ" అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జనించినది.

"ధనిష్ఠ", డా॥ కంభంపాటి పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

"ధనిష్ఠ" ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యానమందిరమును, సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము" గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

# ముందుమాట

2004 జనవరిలో గురుపూజల సందర్భంగా మాస్టర్ పార్వతీకుమార్ గారు మాస్టర్ ఇ.కె. గారిచే అందించబడిన అంతర్దర్శన ధ్యానము లను ప్రవచిస్తున్న సందర్భంలో సోదరులు శ్రీ కంభంపాటి శివశంకర్ మాస్టర్ సి.వి.వి. గారందించిన 33వ ధ్యానమును గూర్చి వివరించ వలసినదిగా కోరారు. మరునాడు ఉదయం ప్రవచనంలో మాస్టర్ పార్వతీకుమార్ గారు సి.వి.వి.గారి యోగము నందు కర్మరాహిత్య మెలా జరుగుతుందో వివరించారు. ఈ ప్రవచనం చాలామంది సోదరులకు స్ఫూర్తిని కలిగించటంచేత దీనిని ప్రత్యేకంగా, యథా

తథంగా, ప్రసంగరూపములో ముద్రించి అందిం చటం జరుగుతోంది. ఈ చిన్న పుస్తకం మాస్టర్ సి.వి.వి. యోగ సాధకులకు వలసిన ఉత్సాహాన్ని 'మే కాల్' సందర్భంలో పునరుజ్జీవింప జేస్తుందని భావిస్తూ, సర్వాంగ సుందరంగా ముద్రించి సమర్పిస్తున్నాము. మాస్టరుగారు యోగాన్ని సాధకులలో బలపరచి, వాహికలను సరిదిద్ది, కర్మగతులను నిర్మూలించి, సాధకులను లోకహితులుగా తీర్చిదిద్దురు గాక !

- ధనిష్ఠ.

# మాస్టర్ సి.వి.వి.
# యోగము - కర్మరాహిత్యము

కర్మము వాయిదా వేయడమూ కాదు, త్వరితగతిని ముందుకు తీసుకువచ్చి అనుభ వింప చేయడమూ కాదు. కర్మము రహితము చేయడము లేక హరించడము అనే ఒక నూతన విధానాన్ని మాస్టర్ సి.వి.వి. గారు యోగంలో ప్రవేశపెట్టారు. అందుచేత ఇది ఒక నూతన యోగము అనే భావము ఏర్పడుతూ వచ్చింది. 'జీవులు కర్మ అనుభవించ వలసినదే' అనే సిద్ధాంతం మనకు మొదటినుండి సృష్టిలో ఉన్నది. ఎవరెవరు ఏఏ కార్యములు, ఏఏ ఉద్దేశ్యములతో, ఏఏ విధముగా నిర్వర్తించారో వారివారికి తత్ఫలి తాలు ఆ విధంగా అందింపబడాలి అనేది సృష్టి

ధర్మము. భగవంతుడు సృష్టి నిర్మాణము చేసి, సృష్టిలో తానే ధర్మముగా నిలబడి ఉన్నాడు. అందుచేత ధర్మ నిర్వహణ నిష్పక్షపాతముగా జరుగుతుంటుంది. భగవంతునికి అందరూ తనవారే. పరాయివారు ఎవ్వరూ లేరు. అందుచేత అందరి విషయంలోను ఒకే విధమైన కర్మాను భూతి ఏర్పరిచాడు. సత్కర్మలకు సత్ఫలితాలు, దుష్కర్మలకు దుష్ఫలితాలు, యజ్ఞార్థ కర్మలకు మోక్షస్థితీ... ఇలా ఏర్పాటుచేయడం జరిగింది. సత్కార్యాలను చేసేవారు పుణ్యాలను అనుభ విస్తారు. ఆ పుణ్యము అయిపోగానే మళ్ళీ మామూలుగా ఉంటారు. 'క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి', అంటే మళ్ళీ మరణించి ఈ లోకంలోనే మరల జన్మిస్తుంటారు. అందుచేత శుక్ల, కృష్ణ పక్షాలుగా జీవులు క్రిందికి పైకీ వెళుతుంటారు.

పుణ్యంచేసి మంచిలోకాల్లోకి, అంటే ఇక్కడే సుఖానుభూతి పొందుతున్నప్పుడు జీవుడు సహజంగా గర్విస్తాడు. ఆ గర్వించడంలో కొన్ని తప్పులు చేస్తాడు. మదిస్తాడు. ఆ మదంతో అతను తప్పులు చేస్తుంటాడు. అందుకని మళ్ళీ క్రింద పడిపోతుంటాడు. దేవతలకైనా ఇది తప్పదు. దేవతలైనా అప్పుడప్పుడు నక్షత్రం రాలినట్లు పడిపోతుంటారు. పడిపోవడం లేవడం, పడిపోవడం లేవడం ఇలా ఒక కథ జరుగుతుంటుంది. సుఖదుఃఖములనే ద్వంద్వముల నుండి అనుభవైక్య కారణంగా ద్వంద్వాతీత స్థితిలోనికి ప్రవేశించడానికి బుద్ధిమంతుడైన మానవుడు యజ్ఞార్థకర్మలు చేస్తుంటాడు. 'యజ్ఞార్థం యజ్ఞార్థం' అని చెప్పి చేసేవాటిలో కూడా స్వార్థం చాలా ఉన్నది. కారణము

ఏమంటే, సంస్కారం ఇంకా పెరగక పోవడమే! కేవలము పదము అది వాడుతుంటాం. లోపల అందరికీ ఏదో కావాలి. ఏమీ అక్కర్లేకుండా చేసేవారున్నారా? అంటే వారివారి అంతరాంతరములలో వెదికి చూసుకోవాలి. అందుచేత కలియుగంలో యజ్ఞార్థము అని జరిగే కర్మలలో కూడా ఏవో స్వార్థాలుంటూనే ఉంటాయి, తత్ఫలితాలు అనుభవిస్తూనే ఉంటారు. ఇలా ఎన్నాళ్ళు? ఈ భూమికి ఒక పరిణామ మున్నది. జీవులకి ఒక పరిణామ మున్నది. ఈ పరిణామములో వాళ్ళు కొంత ముందుకు వెళ్ళవలసిన అవసర మున్నది. అందుచేత ఈ వచ్చే కుంభయుగంలో మానవజాతి కొంత తేలికపడాలని భగవంతుడే సంకల్పించాడు. కుంభయుగం వచ్చేసింది. మానవులు మాత్రం అలాగే ఉన్నారు. అన్నీ వృద్ధి

చెందుతున్నాయి కానీ మానవుడు పరిణామము చెందడం లేదు. క్రిందికి పైకీ, క్రిందికి పైకీ అవుతూ అక్కడే ఉన్నాడు. అందుకని వీరందరినీ వేరే మార్గంలో ఉద్ధరించాలనే ఒక భావన. ఆ భావన కారణముగానే మరొక చైతన్యము ప్రవేశపెట్టాడు. అది మనకి Sirius 'శరమ' అనే నక్షత్ర మండలము నుండి బయలుదేరి వచ్చి సింహరాశిలో, Regulas అనే ఒక సింహరాశి మండల కేంద్రమైనట్టి సూర్యప్రజ్ఞ నుండి భూమికి అందించడం జరిగింది. అందుకని శ్రావణ పూర్ణిమ సందర్భముగా పుట్టిన మాస్టరుగారు, అగస్త్యాశ్రమము నుండి వచ్చిన మాస్టరుగారు దీనిని అందుకొని ఈ భూమి మీద ప్రవేశింపచేసారు. అన్నీ త్వరిత గతిని పరిణామం చెందాలి. ఖనిజములు, వృక్షములు, జంతువులు, మానవులు అన్నీ

పరిణామము చెందాలి అనే ఉద్దేశ్యంతో ఒక తరంగంగా, భగవదనుగ్రహంగా ఏర్పడ్డది. భగవదనుగ్రహంగా ఏర్పడ్డదానికి సిద్ధాంతం లేదు. అటువంటి సన్నివేశాలు ఇంతకు ముందు సృష్టిలో కూడా ఉన్నాయి.

శ్రీకృష్ణుడు గోపికలకు మోక్షస్థితి అందించాడు. చాలామంది తపస్సు చేసే ఋషు లకి అందించలేదు. ఏమిటది? అని అడిగితే 'నా పిల్లలు! నా పిల్లలకు నా ఇష్టం వచ్చినట్లు అనుగ్రహం కురిపిస్తుంటాను. ఎవరికి ఏమిస్తున్నాను అనే దానిమీద పెద్ద తర్కం లేద'ని చెప్పాడు. మైత్రేయ మహర్షి అంతటివాడు 'వీరు మనకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. వారిని మీరు అనుగ్రహిస్తున్నారేమిటి? మనకి అనుకూలముగ పనిచేస్తున్నవారి ఎడల చూపని అనుగ్రహము

వ్యతిరేకులకు అనుగ్రహిస్తున్నారేమిటి?' అని ప్రశ్నిస్తే 'మీకుగ మీరు చాలా సిద్ధాంతాలు పెట్టుకున్నారు, మీరు వాటిల్లో బ్రతుకుతుంటారు. మీ సిద్ధాంతాలతో మీరు నన్ను కట్టెయ్యకండి' అని చెప్పాడు. కుబ్జని ఎందుకు అనుగ్రహించాడు, మరొకరిని ఎందుకు అనుగ్రహించలేదు? కొన్నిటికి తర్కం కుదరదు. సిద్ధాంతాలు కుదరవు. భగవంతుడే తనకుగా తాను నిర్ణయము చేసుకున్నప్పుడు, తనకుగా తను జీవులని ఉద్ధరిద్దామని అనుకున్నప్పుడు తను ఏర్పరిచిన సిద్ధాంతాలను తానే అతిక్రమించగలడు. దానినే 'అనుగ్రహము' అన్నారు. ఇలా కొన్ని కొన్ని సమయములలో, కొంతకొంత మంది వ్యక్తుల విషయములలో, కొన్ని కొన్ని రకాలుగా కొన్ని కొన్ని మినహాయింపులు భగవంతుడే నిర్వర్తించినట్లుగా

మనకి గోచరిస్తుంది. అది భగవదనుగ్రహంగా ఏర్పడ్డది. శ్రీకృష్ణుని జీవితంలో ఇది బాగా గోచరిస్తుంది. ఎవర్ని ఎందుకు అనుగ్రహించాడు, ఎవర్ని ఎందుకు నిగ్రహించాడు, ఎవరితో ఎందుకు అట్లా ప్రవర్తించాడు అనేది ఎవరెవరి మేధస్సు మేరకు వారువారు గమనించడమే తప్ప ఆనాటికీ ఈనాటికీ శ్రీకృష్ణుడు పరిపూర్ణంగా అర్థమయ్యే తత్త్వం కాదు. దాన్ని అనుగ్రహ మార్గము అంటారు. ఈ మార్గాన్నే ఏసుక్రీస్తు, రామానుజా చార్యులవారూ నిర్వర్తిస్తూ వచ్చారు. భగవంతుని అనుగ్రహానికి తీరు తెన్నులు లేవు. ఎవర్ని ఏవిధంగ అనుగ్రహిస్తాడో సిద్ధులకే తెలియదు. ఋషులకు, మహాత్ములకు కూడా తెలియదు. అలా తెలియని పద్ధతులలో మనకి తెలియని అర్హతతో అనుగ్రహ ముంటుంది.

మన జగద్గురు పీఠములో ఎంతోమంది ఎంతో పెద్దపెద్ద పనులు చేస్తున్నారు కదా! వీరంతా అర్హత ఉండే చేస్తున్నారా? ఏ శాస్త్రం చదువుకున్నారు, ఎంత సంస్కృత పాండిత్య మున్నదీ? అయినా నలుగురికీ పనికి వచ్చే పనులు నాలుగూ జరుగుతున్నవే! సమర్థతతో పనిలేని అనుగ్రహము కారణము చేత మందులు వేస్తే తగ్గిపోతుంటాయి. సలహా యిస్తే అయిపో తుంటుంది. అదంతా తన ప్రతిభ అనుకుంటే మళ్ళీ అది ఒక పద్ధతి. అది భగవంతుని అనుగ్రహము. అది మాస్టరుగారి అనుగ్రహము. అది మాస్టరుగారి సాన్నిధ్యము అనుకోవడంతో చాలా కార్యక్రమాలు నడుస్తున్నాయి కదా! ఏమీ తెలియనివాడిని ఈ రోజు నుండి నువ్వు మందు లియ్యి అని, ఆ రోజు నుండి మందులిస్తే

తగ్గిపోతుంటే.... మందు లిచ్చేవాడు నేనివ్వడం వల్ల తగ్గిపోతుందని అనుకుంటే మందులివ్వ గలడా?... అలాగే జ్యోతిష్యం చెప్పేవారుంటారు. అలాగే వేదం చెప్పే వారుంటారు, అలాగే చాలా జరుగుతుంటాయి. ఏమిటిలా అంటే చాలా వింతగా ఉంటుంది. నిజానికి జగద్గురుపీఠంలో చాలామంది అర్హత లేకుండా చాలా పనులు చేస్తుంటారు. ఈ అర్హతలుంటేనే ఈ ఈ పనులు చేయవచ్చనే సిద్ధాంతము ఒకటి వున్నది. మనవరకు ఆ సిద్ధాంతము అంతగా వున్నట్టు కనిపించడం లేదు. మాస్టరుగారి మీద పరిపూర్ణ మైన విశ్వాసముంచి కార్యక్రమములు నిర్వర్తిస్తే వీళ్ళని ఆయన ఆ కార్యక్రమములోంచి ఉద్ధరిం చేస్తున్నారు. 'ఒక తెలుగు పండితుణ్ణి నన్నే ఇంత వాణ్ణి చేసారు మాస్టరుగారు' అని మన మాస్టరు

గారు అంటే.... అసలు ఆయనే మహా మేధావి. ఆయనే ఉత్తమోత్తమమైన ధీశాలి. అలాంటి ఆయనే అంటూండేవారు 'మనమెంతోయ్! మనకి ఏం తెలుసూ' అని. ఆయనకే ఏం తెలుసంటే, మనకి ఏం తెలుసు? మనకి ఏం తెలియకుండా మనం అన్ని పనులు చేసేస్తున్నామే! బయట అందరికీ ఆశ్చర్యంగా ఉంటుంది, ఎట్లా చేస్తున్నారని. దాన్ని అనుగ్రహం అంటారు. ఆ అనుగ్రహ మార్గాన్నే భగవంతుడు ప్రవేశపెట్టాడు. ఇదివరకు భగవంతుడు శ్రీకృష్ణుడిగా వచ్చినప్పుడు దాన్ని నిర్వర్తించి చూపించాడు. అందుకే మాస్టరుగారు "మళ్ళీ కృష్ణావతారమేనోయ్ మాస్టర్ సి.వి.వి." అనేవారు. నేను నీ ప్రాకృత కర్మను, భృక్తమును రహితము చేసుకుంటాను. మీరు నాకు సమర్పణము చేసుకోండి. నేను

చెప్పినట్లుగ ప్రతి ఉదయము, సాయంత్రము నా ప్రార్థన చేసుకోండి. మీకెంత కర్మ ఉన్నదీ అవన్నీ మీకనవసరము. దానిని నేను రహితం చేస్తాను. వాయిదా వేయను. నేను పుచ్చుకొని బాధపడను. 'ఎవరిదో జబ్బు పుచ్చుకొని మనం జబ్బుపడడం మాస్టరుగారి మార్గం కాదు' అని చెప్పేవారు మన మాస్టరుగారు. అదెలా? ఒక పెద్ద జబ్బు ఒకాయనికి 40 రోజుల పాటు ఉండాలనుకోండి! ఆ జబ్బు ఓ 40 మందికి పంచేస్తే? అందరికీ తలోరోజు కొంచెం బావుండదు. 400 మందికి పంచేస్తే? అందరికీ ఓ రోజులో ఓ 2½ గంటలు బావుండదు. 4000 మందికి పంచేస్తే? అందులో పదోవంతు అయిపోతుందా! అదీ కుంభ చైతన్యము యొక్క తీరు. To Distribute and Neutralise. Sharing

and Distribution అనేది కుంభ చైతన్యములో ఒక ముఖ్యమైన విషయము. అలా పంచేయడానికి, 'అలా పంచుకుంటాం మాస్టారూ' అంటూ ఆయన చుట్టూ చాలా మంది చేరిపోయారు మనకి తెలియకుండా. అది మహా పెద్ద ఆశ్రమము. ఆ ఆశ్రమములో జీవులకందరకూ వచ్చే భాగాన్ని పంచుకోవడానికి కొంతమంది తయారైనారు. అలాగ దీర్ఘరోగంతో ఒకడు చచ్చిపోకుండా దాన్ని 4 లక్షలమంది పంచుకున్నారనుకోండి! ఏమైపోయిందదీ? అలాగే ఒకాయనకి 10 లక్షల అప్పున్నదనుకోండి, అది వాడి కర్మ అనుకోండి. ఆ 10 లక్షల అప్పుని 10 లక్షలమంది పుచ్చుకుంటే ఒక్కొక్కడికీ ఒక్కో రూపాయి పోతుంది. ఓ లక్షమంది పుచ్చుకుంటే 10 రూపాయలు పోతుంది. 10 రూపాయలు పోతే ఏం పోయింది?

అలా అన్నీ కూడా పంచేసి, ఎవరికీ ఇబ్బంది కలగకుండా, దాన్ని ఆ విధంగా రహితం చేయడం అనే కార్యక్రమాన్ని పెట్టారు. Through distribution it is shared by all it is neutralised. అలా అందులో తానే సింహభాగం తీసేసుకుంటాడుట. అందులో మాస్టర్ సి.వి.వి. శివ ప్రజ్ఞ! Lion's share నేను పుచ్చుకుంటారా, కాని నాకేం అవ్వదు, ఎందుకంటే హరుణ్ణి నేను, హరిం చేస్తాను అంటారు. హాలాహలం పుడితే ఇది ఎవరు పుచ్చుకుంటారని అంతా బాధపడ్డారు కదా! ఇహ తర్వాత వచ్చిన వాటన్నిటినీ చక్కగా, ఆనందంగా పళ్ళెంలో పెట్టి ఇచ్చారు, తీసుకున్నారు నవ్వుతూ. ఐరావతం వచ్చింది, ఇంద్రుడు చక్కగా పుచ్చుకున్నాడు. ఉచ్ఛైశ్రవము వచ్చింది, ఆనందంగా పుచ్చుకున్నారు. లక్ష్మీదేవి వచ్చింది,

విష్ణుమూర్తి పుచ్చుకున్నాడు. ఇలా ఎంతోమంది అన్నీ పుచ్చుకున్నారు. కాని ముందు వచ్చింది విషం కదా! ఎవరు పుచ్చుకుంటారు? ఎవ్వరూ లేరు పుచ్చుకోడానికి. అందుకని శివుడు పుచ్చుకున్నాడు. ఆయనకి ఏం కాలేదు. అది ఏ లోకాలకీ ఇబ్బంది లేకుండా తన దగ్గర ఉంచుకున్నాడట, అలా ఉండవోయ్ నా దగ్గర అని. ఈ నాటికీ ఆ విషాన్ని మరి వదల్లేదు కదా! అలా మానవ కర్మ అనే విషాన్ని పుచ్చుకొనేవాళ్లు ఎవరు? మళ్ళీ భగవంతుడే పుచ్చుకోవాలి. అలా మానవ కర్మని హరించే పద్ధతి ఒకటి ఉన్నది. 'భృక్తరహిత' అని చెప్పడంలో ఉద్దేశ్యము ఏమంటే రెండు రకాలుగా హరించేస్తాను అని. ఒకటి, దానిని నేనే పుచ్చుకొని హరించేస్తా. రెండవది, ఈ విధంగా పంచేసి హరించేస్తా. అందుచేత నీకు బరువు తగ్గుతూం

టుంది. ఆ కారణంగా ఈ మార్గంలో నీవు ముందుకు వెళతావు. జీవులు పరిణామము చెందుతారు. అంతేకాదు, నీకు త్వరితగతిని సూక్ష్మశరీరం ఏర్పడి, నీవు చిరంజీవివై, అమృతత్వానికి అంటే మరణం దాటే స్థితిలో నిన్ను నిలబెడతాను. అప్పుడు నువ్వు లోకహితుడుగా ప్రపంచానికి పనిచేస్తుంటావు. ఈ మార్గంలోనే పరమగురువులు పనిచేస్తున్నారు.

పతంజలి యోగసూత్ర పద్ధతులలో, అష్టాంగ యోగాన్ని నేర్పుతూ మైత్రేయాది మహర్షులు ఈ భూమి మీద మృత్యువును దాటే మార్గాన్ని ఒకటి ఏర్పరిచారు. అదే యోగవిద్య. దానివల్ల ప్రతి శతాబ్దానికీ 10, 12 మంది మాత్రమే దాటుతున్నారు. అంటే 50 శతాబ్దాలు జరిగితే మహా అయితే 600 మంది దాటినట్టు. 5 వేల

సంవత్సరాలకి 600 మందంటే ఎప్పటికి జరిగేను? అందుచేత దిగివచ్చింది. ప్రతి శతాబ్దానికి ఒక వెయ్యిమందిని ఇలా తయారు చేసేద్దా మన్నారు. కుంభయుగం మనకి 2,160 సంవత్సరా లున్నది. Geometrical progression మనకి వస్తూ ఉంటుంది. ఆ విధంగా మానవులందరూ ఉద్ధ రింపబడు తుంటారు. ఎందుకంటే మృత్యువును దాటవలసిన పరిస్థితి వచ్చేసింది. 16 పెట్టెల రైలు బండి సరిపోలేదు, ప్లాట్ఫామ్ మీద ఇంకా చాలా మంది ఉండిపోయారు, అంటే ఇంకో రైలు వెయ్యరూ? వేస్తారు కదా! extra train వేసి extra clear చేస్తారా? అలాగే బస్సు లూనూ, Plane లూనూ. Extra వేస్తుంటారుగా. Extra ఎందు కండీ అలా rule లో లేదుకదా అంటే ఎలా? Rule ఒక పనిని సక్రమంగా నిర్వర్తించడానికి పెడతారు.

కాని ఒక విపత్కర పరిస్థితిలో, అందరూ ఇరుక్కు పోయే సందర్భములో వీరందరినీ ఉద్ధరించ డానికి, ఒక పద్ధతన్నమాట. అలా జరగడానికి వీల్లేదు, అంటే కుదరదు. నువ్వెవడివి వీల్లేదన డానికి? అసలు అంతా అలా చెప్పింది నేనే కదా! నేనే మారిస్తే నువ్వెవడివి మధ్యన? One day international ఆడుతూ 50 overs అని పెట్టు కున్నారనుకోండి! సగంలో వర్షం పడ్డదనుకోండి. అప్పుడు ఏవో లెక్కలు వేసి 30 overs కి ఇన్ని runs కొట్టాలని చెప్తారు. అలా పెట్టకూడదంటే! ఓ పద్ధతి ఏర్పాటు చేసుకొని ఆ పద్ధతిగా జరగ నప్పుడు, దాంట్లోంచి జీవులు ఇబ్బంది పడుతు న్నప్పుడు మార్పు రావాలి. ఒక లక్షమంది match చూడడానికి వచ్చినప్పుడు 50 overs ఆడడానికి వీల్లేదని ఆట cancel చేస్తే ఊరుకోరు. ఇలా

మార్పులు రావాలి. ఒక నియమము పెట్టు కుంటాము. కాని కాలం నుండి మనకి ఒక సందేశం వస్తే ఆ నియమాన్ని మార్చుకుంటాము.

పురాణాలలో నత్కీరుని కథ ఉన్నది. నత్కీరుడు చాలా మంచి పండితుడు. పచ్చి శివ భక్తుడు. పచ్చి పండితుడు. అంటే కామా ఉండ వలసిన చోట కామా, విసర్గ ఉండవలసిన చోట విసర్గ, గ్రామరు ఇలా అన్నీ శాస్త్రంలో చెప్పినట్లుగ మాత్రమే ఉండాలి. లేకపోతే ఒప్పుకోడు. అలాంటి పండితుడు ఒక రాజాస్థానంలో ఉన్నాడట. అదే రాజ్యంలో, తన పొలంలో ఇంకొకడు, రోజూ ఉదయం, సాయంకాలం ఒకసారి 'ఓం నమః శ్శివాయ' అనుకుంటాడుట. బహు కుటుంబి. బాధలు పడుతున్నాడు. శివుడు చూశాడు. పామరుడు. అయినా తన భక్తుడు. చాలా

ఇబ్బందులు పడుతున్నాడు. ఏమీ అడగడు. తనని తలుచుకుంటాడు. ఎట్లా ఉంటుందండీ! మనబోటి వాడికే వీడికి ఏదన్నా చేయాలని పిస్తుంది. అలాంటిది దైవానికి మనకన్నా కోట్ల రెట్ల కరుణ, ప్రేమ, ఆదరణ ఉంటుంది. అందు చేత వాడికి ఒక రోజు శివుడు కనిపించి 'నేనొక పద్యం రాసిస్తాను. అది రాజుగారి కొలువులో చదువు, రాజుగారు సంతోషించి నీకేమన్నా ఇస్తారు. దాన్తో ఈ జన్మకి ఈ బాధలు ఏమీ ఉండవు' అని చెప్పి ఒక పద్యం రాసి ఇస్తాడు. సరే ఆ పేద భక్తుడు శివుడు రాసి ఇచ్చిన ఆ పద్యం తీసుకొని సభకి వెళ్ళాడు. రాజుగారి వద్దకు వెళ్ళి 'నేనొక పద్యం రాసాను, అది మీకు చదివి వినిపిస్తాను' అని చదివి వినిపించాడట. రాజుకి హృదయం పొంగిందిట. ఎందుకంటే అందులో

హృదయాన్ని కరిగించేంత భావం ఉన్నది. రాజు చాలా సంతోషించి కొన్ని అగ్రహారాలు, వేలలేని ఆభరణాలు, ధనము ఇలా అన్నీ ఇవ్వడానికి సిద్ధ పడ్డాడుట. ఆ రాజాస్థానంలోనే ఈ నత్కీరు డున్నాడు. 'మహారాజా ఆగండి!' అన్నాడు. ఏం, అన్నాడు రాజు. ఈ పద్యంలో తప్పుంది' అన్నాడు. 'తప్పుంటే ఉందిలే. భావం బావుంది కదా! అందుకే ఇస్తున్నాను' అని అంటాడు. అయినా 'అతడు పేదవాడు గనుక ఇవ్వాలను కుంటే ఇవ్వండి గాని, పద్యం విని మీరు ఇవ్వడానికి వీల్లేదు. అందులో తప్పున్నది' అంటాడు. రాజు ఎంత నచ్చచెప్పి చూసినా ఆయన ఒప్పుకోడు. చివరికి శివుడే దిగివస్తాడు. 'ఇది నేనే రాసి ఇచ్చాను, వాడికి ఏదో కొంత ధనం లభించి, వాడి పేదరికం పోతుందని' అని చెప్తాడు. 'నువ్వు

శివుడివైనా తప్పు తప్పే' అంటాడు. ఆయనకి అతడి మొండి వాదనకి కోపం వచ్చి శాపం ఇచ్చేస్తాడు. అక్కడ తప్పు, ఒప్పు అన్నది కాదు ప్రధానం. భావం ప్రధానం. భగవంతుడు సృష్టి నిర్మాణం చేసినప్పుడు కొన్ని ధర్మాలు ఏర్పరిచాడు. ఆ ధర్మం ప్రకారమే దైవం కూడా పనిచేస్తుంటాడు. కానీ అనూహ్యమైన ఒక పరిస్థితి ఏర్పడినప్పుడు అతడు మార్చలేడా? మార్చ గలడు. అలా మార్చడాన్నే అనుగ్రహము అంటారు. మైత్రేయుడు కూడా కృష్ణుని అడుగు తాడు. 'మీరు ఆ సిద్ధాశ్రమంలోని వారిని అలా అనుగ్రహించేస్తున్నారు. వారికి అసలు ఒక పద్ధతి లేదు. అంతా త్రాగుబోతులు, తిరుగుబోతు లూను' అని. అంటే కృష్ణుడు నవ్వుతాడు. 'ఏం అలా నవ్వుతున్నారు' అంటే 'నేనొక క్రొత్త పద్ధతి

పెట్టుకున్నాను.' 'ఏమిటంటే', 'కుశాగ్రబుద్ధివి నువ్వే ఆలోచించి చూడు' అంటాడు. యోగమా అంటాడు. అది మీబోటివాళ్ళకి అంటాడు. భజనా అంటే అది ఉద్ధవునిలాంటి వాళ్ళకి అంటాడు. మరి ఏమిటి చెప్పమంటే, ఆలోచించు అంటాడు. ఇంకేం ఆలోచించనూ మీరు సంకల్పిస్తేనే కదా, అంటాడు. నేనిస్తే తప్ప నువ్వు ఆలోచించలేవు కదా దాన్నేమంటారూ? నేను నీకు సంకల్పం కలిగించడానికి ఏమన్నా conditions ఉన్నాయా. ~~ఈఈ~~ conditions లో ~~ఈఈ~~ భావాలు కలిగించకూడదని ఏమన్నా ఉన్నదా అని అడిగాడు. లేదు అన్నాడు. ఎందుకు లేదు అంటే అది మీ ఇష్టం అంటాడు. దాని పేరు ఏమిటి అంటే 'అనుగ్రహం'. అదే ఇది అన్నాడు. మనకి అనుకోకుండా అద్భుతమైన సంకల్పం వస్తుంది

కదా, ఎందుకు అలా కలిగిందంటే, అలా కలగ కూడదంటే! రోజూ నీ మాటా, నీ చేతా చూస్తు న్నాను కదా నీకు ఇలాంటి సంకల్పం ఎలా కలిగిందీ, అసలు కలగకూడదు కదా అంటే ఎలాగండీ? భగవంతుని అనుగ్రహంతో పిచ్చి వాడు కాళిదాసు అయిపోలేదూ? తల్లి కరుణించ కూడదా? ఎప్పుడూ ఒక సిద్ధాంతం నడుస్తుంటే అప్పుడప్పుడు ఆ సిద్ధాంతం ఏర్పరిచినవారు దాన్ని మార్చగలరు. అట్లా దీన్ని మార్చారు. దీనికి విశ్వాసమే basis. ఇది అనుగ్రహ మార్గము. అనుగ్రహ కారణంగా పనులన్నీ అయిపో తుంటాయి.

మామూలుగ చాలా పలుకుబడి, చాలా ధనం కలిగిన, చాలా అధికారం ఉన్నవాళ్ళు చేయలేని పని మనం చేసేస్తుంటాం. అంటే మనమా?

'రామాద్రి' అలాగే జరుగుతోంది. అలాంటి స్థలం కావాలంటే ఎంతోమంది చుట్టూ తిరిగి, ఎంతోమంది కాళ్ళు పట్టుకొని, రాజకీయంగా ఎన్నోరకాలుగా ఒత్తిడి తెచ్చుకుంటేగాని కాదు. అలాంటిది మన దగ్గరకి మాస్టరుగారు పళ్ళెంలో పెట్టి తెచ్చి ఇచ్చేస్తారు. అదేమిటీ, ఎలా వచ్చిందీ అంటే ఎవరికీ తెలియదు. ఎవరికీ తెలియని పద్ధతిలో మన దగ్గరకు వచ్చేట్లుగా ఉంటాయి అన్నీను. మాస్టరు సి.వి.వి. గారు ఇంకోటి చెప్పారు 'నీకు ఎవడి వల్ల పని ఉన్నదో వాడికే నీతో పని కల్పిస్తాను' అని. మనకేమన్నా 'చేయమంటారా' అంటూ వాడేవచ్చి అడగడంతో మన పని సుళువైపోలేదూ? అనుగ్రహానికి ఆయనదీ అర్హత. మనది కాదు. ఆయన ప్రజ్ఞ పనిచేస్తుంటే అలా గాల్లో తేలిపోతుంటాం. అది వదిలేస్తే

పడిపోతాం. ఆయనిష్టం అయితే వదిలేసినా నిలబెట్టగలడు. అదేంటి వాడు అసలు regularగా ప్రేయరు చేయడు కదా అంటే ఏం లేదు, అది అంతే ! అది నా ఇష్టం అంటారాయన. ప్రశ్నించే అధికారం మనకి లేదు. ఆ రోజుల్లో ఈ భూమి మీద కృష్ణుడు నిర్వర్తించి చూపించాడు. అప్పుడూ ఒక విపత్కర పరిస్థితే. అందుకే అలా ఉద్ధరిం చేశాడు. ముందు నుండీ భగవంతుడు దిగి వస్తాడు ఇహ ముక్తజీవులమైపోతా మనుకున్న వారికి ఏమీ చేయలేదు. వారందరికీ సున్నమే! మిగతా వారందరికీ అన్నం పెట్టేశాడు. అది నారదుడు కూడా ఊహించలేకపోయాడు. కృష్ణుడు నారద మహర్షంతటి వాడికి కూడా ఉహకంద కుండా పనిచేశాడు. ఇహ శకునేం ఊహిస్తాడండీ! ఈ సిద్ధాంత ప్రకారమూ అని, నువ్వు ప్రణాళిక

వేసుకు వెళితే, అదక్కడ ఉండదు. మనకే అవుతుంటుంది ఒక్కోసారి. అసలు ఈ పని కాదు అని అనుకున్నప్పుడు ఏదో ఆలోచనవచ్చి ఎప్పుడూ ఎవరికీ తట్టనిది తట్టి, అది అయిపో తుంటుంది. సందేహం లేదు. అది నా స్వానుభవం. ఎట్లా వస్తుందీ ఆలోచనా అంటే మనం కాదుగా ఆలోచన చేసేది, ఆయన కదా! అలా ఎంతోమందికి ఎన్నో అద్భుతాలు జరుగు తుంటాయి. అలా జరిగినప్పుడెల్లా not my merit. By HIS grace అనుకోవాలి. అంతా మనమే అనుకుంటే పడిపోతాము. అసలు కూర్చొని మాట్లాడుతుంటే మాట్లాడేవాడికి తెలియనివి వాడి నోటి నుండి వచ్చేస్తుంటాయి తెలుసా? అంతకు ముందు ఆ వాక్యం వాడికీ తెలియదు! ఎట్లా వస్తుందీ అనేది ఆలోచించ వద్దు. ఇది ఎట్లా

వచ్చింది, ఎప్పుడూ ఇలా వచ్చేట్లుగా ఏం చేయాలి... ఇలా ఆలోచించితే అవదు. అది అంతే! ఎందుకు అనుగ్రహించాడో తెలియదు. నేను ఇది కాబట్టి అది చేశాడు అనడానికి లేదు. ఇదివరకు భగవంతుడు చేసి చూపించాడు. ఇప్పుడు ఇది బాగా విపరీతంగా పంచేద్దామని. ఒక జన్మలో 12 జన్మల ప్రారబ్ధ కర్మని అలా తీసేస్తాడు. అంటే 12 జన్మల ముందుకు వెళ్ళిపోతున్నాం. అంటే జన్మకి 70 ఏళ్ళు వేసుకున్నా 800 ఏళ్ళు ముందుకు వెళ్ళిపోతామన్న మాట. 'ఇలా నేను మిమ్ములనందరినీ ముందుకు తీసుకుపోతాను' అని మనకి చెప్తూ, పరమగురువులకు, 'నేను వచ్చాను కదా ఎందుకు భయం' అని చెప్పారాయన. రోజూ మనం తలచుకొనేవాళ్ళు, ప్రాతఃస్మరణీయులు అయిన పరమగురువులకు

శతాబ్దానికి 10, 12 కాదూ, ఇహ చూడండి' అని చెప్పారాయన. 'మన మానవ జాతి కంతకూ మైత్రేయుడు ఎటువంటివాడో, మైత్రేయుడికే మైత్రేయు డంతటివాడు ఈ దిగివచ్చిన వాడు' అని జ్వాలాకూల్ మహర్షి మాస్టర్ సి.వి.వి. గారి గురించి వ్రాసారు. మైత్రేయుడికే మైత్రేయుడు అంటే త్రైలోక్య గురువు. అంటే కృష్ణుడు. అదే భగవతత్త్వం. అందుకని 'నేనే బ్రహ్మాంని రా!' అని చెప్పారు. ఆయన అందరినీ 'రా' అనే పిలిచేవారు. భక్తులు ఆయన్ని తిరుపతి తీసుకెళ్ళారు. లోపలకి వెళ్ళి ఆయన దేవుణ్ణి చూస్తున్నారట. పూజారి దండం పెట్టండి అన్నాడట. 'ఎవరికి?' అని అడిగారుట. నీకు నీవు దండం పెట్టుకుంటావా? అని అడిగారట. ఆ పూజారికి అర్థం కాక ఆయన్ని అలా చూస్తే

ఆయన్లోనే వెంకటేశ్వరస్వామి కనిపించేసాడు. అసలు ఎవరికి దండం పెడుతున్నామో ఆయన గురించి అణువు కూడా మనకి తెలియదు. ఆయన అన్నీ క్రొత్త క్రొత్తగా చెప్పారు. పాతవి మర్చిపొమ్మన్నారు. అది నమ్మితే అది సత్యం. ఇది నమ్మితే ఇది సత్యం. గోపికలకి ఇచ్చిన అనుగ్రహం చూసి నారదుడే, ఇహ మిగతా వాళ్ళని ప్రక్కన పెట్టేసి, 'యథా వ్రజ గోపికానాం' అని నారద భక్తిసూత్రాలలో గోపికల పరమభక్తి గురించి రాశాడే! భక్తి గురించి గాని, పరమభక్తి గురించి గాని నారదుడికి తెలిసినంత గోపికలకి ఏం తెలుసు? ఆయన అనుగ్రహం అలా ఉంటుంది. మహా భక్తుణ్ణి అనుకున్న ఉద్ధవునికి గోపికల వద్దకు వెళితే 'తను ఏమీ కాదు' అని తెలిసింది. అంటే నేను తలుచుకుంటే దేనిని

దేనిగా అయినా చేయగలను అని నారదునికే, శ్రీకృష్ణుడు చూపించాడు. 'స్వామీ మాకేం తెలియదని తెలిసిందని.' నారదుడు పాదనమస్కారం చేసుకున్నాడు ఆయనకి. అదీ భాగవతం. మనకి ఏమీ తెలియదని తెలియడమే భాగవతం.

మనకి ఏదో చాలా తెలుసు, చాలా తెలుసుకున్నాం అంటే కుదరదు. ఏ పూటకి ఆ పూట 'బాబూ మాకేం తెలియదు, మమ్మల్ని కాపాడు అనడమే! ఆయన నడిపిస్తే ఒక పద్ధతిగా ఉంటుంది, మనం నడిస్తే ఒక పద్ధతిగా ఉంటుంది. అందుచేత మన మాస్టారు అంటూండేవారు 'ఆయనకి ఇష్టమైతే అలా నడిపించేస్తారు. లేదంటే లేదు. ఎందుకు ఆపాడో తెలియదు, ఎందుకు పరుగెట్టిస్తున్నాడో తెలియదు. చాలా విషయాలు తెలీవు. ఇవన్నీ ఏమిటి మాస్టారు

అంటే 'ఏమో' అనేవారు. మన మేధస్సుతో ఆలోచించి ఉపయోగము లేదు. దీని గురించి కేవలము అనుభవించి చూడు, ఆలోచించి చూడక! ఎలా ఉన్నదీ తింటే తెలుస్తుంది తప్ప 'ఇదెలా వండారు, ఇందులో ఏం వేశారూ, వండిన వాడు బ్రాహ్మడేనా' ఇవన్నీ నీకెందుకూ? ఇది కాదు ముఖ్యం. జంద్యం వేసుకొని, పట్టె నామాలు పెట్టుకొని, మడిబట్ట కట్టుకొని, బాగా వండితే తినడానికి బావుండక పోవచ్చును కదా! అరక్క పోవచ్చును. పాత అలవాటువల్ల ఇలా అన్ని ప్రశ్నలూ అడుగుతావు. మాస్టరు గారి తండ్రిగారు వెళ్ళి పోతే వంటింటిలో ఉన్న కామేశ్వరరావు గారిని పిలిచి, వైష్ణవనామం పెట్టేశారు మాస్టరుగారు. ఈ రోజునుండీ నువ్వు కామేశ్వరాచార్యరా!' అని చెప్పేశారు మాస్టరుగారు. 'ఈ పదిరోజులూ

నువ్వు ఆచారివి. నువ్వే చేస్తున్నావు వంట.' అని చెప్పేసారు. అదేంటి, అంటే అదంతే! బొట్టు పెట్టు కున్నంత మాత్రాన వైష్ణవుడు అయిపోతాడా, బొట్టు పెట్టుకోకపోతే వైష్ణవుడు కాడా! 'వైష్ణవు డటంచు వార్త మాత్రమే గాని' అని వేమన చెప్పాడు కదా! ఈ నిలువుబొట్టు కేవలం వార్తేట వైష్ణవుడని, ప్రవర్తనలో ఏంలేదు. అసలు వైష్ణవు డంటే 'భగవంతునికి సమర్పణ చెందినవాడని' అర్థం. సమస్తము నందు విష్ణువునే దర్శించేవాడు. వాడు బొట్టు పెట్టుకోకపోతే మాత్రమేం? బొట్టు పెట్టుకొని దర్శించకుండా ఉన్నా, బొట్టు పెట్టు కోకుండా దర్శించుకుంటూంటే వాడు వైష్ణవుడు అవుతాడా, అవడా! నహుషుడు ధర్మరాజుని అదే ప్రశ్నించాడు. బ్రాహ్మణుడు చూపించే సంస్కా రాన్ని చూపించే బ్రాహ్మణేతరుడు ఏమవుతాడు?

అని అడిగాడు. బ్రాహ్మణుడే, అని జవాబిచ్చాడు ధర్మరాజు. బ్రాహ్మణుడికి ఉండాల్సిన ఆకారం ఉండి బ్రాహ్మణుడిగా ప్రవర్తించకపోతే ఏమవుతాడు? బ్రాహ్మణ ఆకారము అవుతాడు, అంతే. భాగవతంలో హిరణ్యకశిపుడు చండామార్కుని పిలిచి, 'నా పిల్లవాడికి చదువు చెప్పమంటే ఇలా తయారుచేసారేమిటీ, మీరసలు బ్రాహ్మణులా! బ్రాహ్మణ ఆకృతులే!' అంటాడు. మోసం చేసే వాడు బ్రాహ్మణుడు కాడుగా! అందుకని ఈ రోజుల్లో ఎవరన్నా మోసం చేస్తే వాడు బ్రాహ్మణుడా అని అడుగుతుంటాను. ఎందుకంటే వాడికి తెలివి ఎక్కువ. తెలివి ఎక్కువైతే మోసం చేయడానికి అవకాశం ఎక్కువ. ముందు మాస్టరుగారికి సి.వి.వి.గారు చాలా తికమకలు పెట్టేసారు. ఆ తికమకల్తో అన్నీ వదిలేసి, అందులోంచి

ఆయనకి జ్ఞానం వచ్చేసింది. తర్కం ప్రకారం ఆలోచిస్తే నీకు జ్ఞానం రాదు. అందుకే మాస్టరు గారి దగ్గర చాలా జ్ఞానం ఉండేది.

నేనే ఉన్నాను. ఏవో నాలుగు మందులిచ్చాను. తగ్గింది. కాస్త నాలుగు పుస్తకాలు చదివి ఇంకాస్త జ్ఞానం పెంచుకున్నాను. అదేమిటో knowledge తో వేసిన మందులతోకన్నా స్ఫూర్తితో వేసిన మందులతోనే తగ్గుతున్నాయి రోగాలు. అదేంటో తమాషా! ఒక్కోసారి దుఃఖం వస్తుంటుంది కూడ ఇదేమిటా అని. అలాటి అనుభవాలు నాకు ఎన్నో ఉన్నాయి. నిన్నరాత్రి కాకతాళీయంగా పుస్తకం తీస్తే Nuxvomica వస్తే చదువుకున్నాం అనుకోండి, మరురోజు వాడు ఏం చెప్పినా Nuxvomica వేస్తే తగ్గిపోయినవి ఉన్నాయి. అంతమాత్రంచేత homoeopathic

అనుకోకూడదు. మాస్టరుగారు నాకు ఈ అనుగ్రహము ఇచ్చారు. ఏది? నిన్న రాత్రి చదివించి, ఈ రోజు వాడు వస్తే, వేస్తే తగ్గిపోయింది. ఆ మందు ఎలా పనిచేసిందండీ? ఏమో? homoeo dispensary లో మాస్టరుగారితో పని చేసిన చాలా మందికి తెలుసు. ఒక్కోరోజు, వచ్చిన అందరికీ ఒకటే మందు ఇచ్చేవారు. వాడి symptoms ఏమైనా మందు ఒకటే. ఇవాళ ఇదేరా, అని చెప్పేవారు. ఏమిటదీ? అది మందు కాదు అనుగ్రహం. క్రొత్తల్లో మందులు వేసినప్పుడు, ఆదివారం పేపర్లో పావులూరి కృష్ణయ్య చౌదరి రాసింది చదివితే, సోమవారం వచ్చే 4,5 కేసులు అవే! ఇదేమిటంటే! Kent రాసిన 'Materia Medica' లో ఉన్నట్లుగా మన మందులు పని చేయవు. ఒకాయనకు ఒంట్లో బాగోలేదు. మందు

వెయ్యాలి. Antim tart వెయ్యాలి ఆ patient ని ఇక్కడకు పట్టుకురమ్మని చెప్పా switzerland లో. Thesiana అని ఓ శిష్యురాలు తనే ఆ మందు వేసేసింది. అదింకా serious అయి పోయింది. ఆ మందు వేస్తే serious అయి పోయింది అని చెప్పింది. ఆ మందు ఎవరు వేశారు? అని అడిగాను. నేనే అని చెప్పింది. నువ్వేస్తే ఎట్లా తగ్గుతుందీ? అని, ఆ సాయంత్రం అదే మందు, ఆమె ముందే ఆయనకు వేసాను. మర్నాడు ఉదయం ఆయన బావున్నాడండీ! అదేమిటండీ? ఏమనుకోవాలి నేను? హోమియో వచ్చునుకోవాలా, జ్యోతిష్యం వచ్చునుకోవాలా, నాకు యోగం వచ్చునుకోవాలా? ఏమీ 'వచ్చు' అనుకోక. అట్లా ఉండు. దండం పెట్టుకో. ఉండు. అందుకనే M.N. అంతటి వారు, V.P.S. అంతటి

వారు, రామకోటయ్యగారంతటివారు ఏమన్నా చెప్తే నమస్కారం చేసుకుందాం అని చెప్పేవారు అంతే. స్వామీ ఇవాళ ఈ పని ఏదో వచ్చింది, నువ్వే చేసిపెట్టాలి అంటే చేసిపెట్టేస్తారండీ! అలా నేను నా వృత్తిలో ఎన్నో అద్భుతాలు చూసాను. గుర్తు పెట్టుకోండి మీరు ఏ వృత్తిలో ఉన్నా, ఏ వ్యాపారంలో ఉన్నా you are some thing special అనిపిస్తారు మాస్టారు. Not because of your ability but because of his grace. అదీ ఇందులో విచిత్రము. అందుకనే చాలా మేధా సంపత్తి ఉన్న మాస్టరుగారే అన్నీ తీసి అవతల పెట్టేసారు. ఈ మానవుడికి మనస్సులో రజోగుణ ప్రవృత్తి బాగా ఉండడం చేత ఏవో చాలా కావాలి, అది చెయ్యాలి, ఇది చెయ్యాలి అనిపిస్తుంది అని రాసారు మాస్టరుగారు. అందుకనే కోర్స్ లంటే

కోర్స్‌లు ఇచ్చారు. ఇప్పుడు మనం చేసేవన్నీ కూడా వేరే పిచ్చి పనులు. ఏమీ చేయకుండా ఉండడానికే. కాసేపు పూజ అని, కాసేపు హోమం అని, కాసేపు అభిషేకమని, కాసేపు పారాయణ మని.... ఇలా ఎందుకు చేసుకుంటున్నాం అంటే మరో పిచ్చి పని చేయకుండా! అందులో కూడా బాగా చేయిస్తారు. మీరేమన్నా స్తోత్రం చేసు కుంటుంటే ఆ స్తోత్రంయొక్క భావం మీలో పట్టుబడేటట్లుగా చేస్తారు. మనవాళ్లు ఎంతెంత మంది ఎన్నెన్ని వ్యాఖ్యానాలు రాసేస్తుంటారూ! మహాపండితులల్లే రాస్తుంటారు. కృష్ణదేవరాయల వారి ఆస్థానాన్ని మించిపోయి మరీ. ఎక్కడనుండి వస్తోందండీ? అంటే అదొక్కటే ఆలోచించకా! అని చెప్తారు. నీకర్థం కాదు. నాకే అర్థం కాదు. 'మాస్టరుగారికి వదిలేసెయ్యి' అనేవారు మన

మాస్టరుగారు. ఒకచోట రాసారు మాస్టరుగారు "Understanding leads to no understanding" అనేదే 33rd initiation వోయ్ అని. Masonic system లో 33rd degree initiation మాస్టరు గారు మనకి ఇచ్చారు రాసుకోండి అని. చేసు కుంటూపో. మిగిలినది ఆయనకి వదిలిపెట్టు. ఆయన నీ చేత ఏం చేయిస్తాడో! ఏదన్నా చేయించగలడు. ఎంతో పెద్దది బ్రహ్మాండంగా చేసి, అతి చిన్నది నీవు అసలు చేయలేకపోవచ్చు.

ఒక చక్రవర్తి ఉన్నాడట, చాలా బ్రహ్మాండంగా పరిపాలిస్తున్నాడట. అంత సమర్థవంతుడైన వాడు లేడుట. ఒక ఆదివారం ఆయన పరివారం శెలవులో ఉన్నారట. మహారాణీ వారు పుట్టింటికి వెళ్ళారుట. ఇంతోటి రాజుగారికీ దాహం వేసింది. కూజాలో నీళ్ళు త్రాగాలి. కూజాలో చూస్తే నీళ్ళు

లేవు. మనకి కావాల్సి వచ్చినప్పుడు నీళ్ళు ఉండక పోవడమే కదా మాస్టరు సి.వి.వి.! సరే ఏంచేద్దాం. సరదాగా బావి వద్దకు వెడదా మనుకున్నాట్ట. బావిలో చేద వేసేసరికి ఆ తాడు పుల్లీలో ఇరుక్కు పోయిందిట. దాన్నేదో సరిచేద్దామని ఇలా చేయి పెడితే ఆ చేయి కూడా అందులో ఇరుక్కుపోయి చెయ్యంతా రక్తం వస్తోందిట. ఇంతోటి చక్రవర్తి గారికీ ఏడుపొచ్చి భగవంతుడితో అన్నాట్ట 'స్వామీ ఇంత సామ్రాజ్యాన్నీ నేనే పరిపాలిస్తున్నా నను కున్నాను. బావిలోంచి నీళ్ళు తోడడం కూడా చేత కాని వెధవని, నాచేత ఇంత సామ్రాజ్యం నువ్వు కదా పాలింపచేస్తున్నావు' అని. ఎప్పటికప్పుడు మనకి మనం ఒట్టి భద్రయ్యల మనే గుర్తుండాలి. వీరభద్రయ్యలమని గుర్తుండ కూడదు. మా చిన్నతనంలో రేలంగి ఓ సినిమాలో మాటిమాటికీ

మీసాలు పైకి తిప్పుతూ, వీరభద్రయ్యని అంటూంటేవాడు. ఎవరైనా పహిల్వాన్ వస్తే మీసం క్రిందికి దింపేసి ఒట్టి భద్రయ్యని అంటూండే వాడు. అందుకని మనమూ ఆయనలో కూర్చున్నంత సేపూ మనం వీరభద్రయ్య, ఆయనలోంచి దిగామంటే మనం ఒట్టిభద్రయ్య కూడా కాదు. ఏ భద్రతా లేదన్నమాట. బండి అలా నడిపిస్తాడు. ఇదీ నాకు అనుభూతిపరంగా, అవగాహన పరంగా తెలిసిన Neutralisation. ఎక్కువ అర్థం చేసుకోకపోతే ఆయనే ఎప్పుడో అర్థం చేసుకుంటారట. నేను రాసిన ఈ sirius, regulas శారమేయ మండలాలు... ఇవన్నీ ఎక్కడ నుండి వచ్చినాయీ? ఆయన తెలిపితే తెలిసాయి. లేకపోతే మనకి తెలియవు. ఆయనకి తోస్తే ఆయనే చెప్తూంటాడు. నా గురించి ఇలా అనుకో

అని చెప్పి. ఎంత చెప్తే అంతే తెలుస్తుంది. ఎంత మాత్రమున ఎవ్వరు పొగడిన అంత మాత్రమే నీవు. ఎవరన్నా అంతా పొగిడారా! పొగడలేదు కదా! అందుకనే అంతా తెలియదు. ఇప్పుడు నీకెంత కావాలో అంత తెలుస్తుంటుంది. జరిగిపో తుంటుంది. తెలుసుకోడానికి ప్రయత్నం చేయక. అదీ మార్గం. మనలో ఒక రకమైన సుళువొస్తే నవ్వుకోగలం. ఎందుకంటే ఆయన తిప్పలు పెట్టినా అలాగే పెడతాడు. పెద్ద విషయాలలో solutions ఇచ్చేసి, చిన్న చిన్న విషయాలలో తిప్పలు పెట్టేస్తాడు. అంటే ఏమిటి, చిన్న విషయాలే చేసుకోలేవు, పెద్ద విషయాలు నీ వల్ల అయినాయా అని నీకు తెలియ చెప్పడానికి. ఆ పెద్దవన్నీ నీవల్ల కాలేదురా, అవన్నీ నా వల్ల అయినాయి. ఇదీ మార్గము. అందుకని మాస్టరు

గారు ‘మంద్రజాలం’లో దీన్ని ‘అనుగ్రహమార్గం’ అన్నారు.

నా ఇష్టం వచ్చినట్లుగా నేను అనుగ్రహిస్తాను పో, అని చెప్పారు. ముందు నీ నుండి పని చేస్తానని చెప్పారండీ. ఓహో ఇహ మన నుండే గురువుగారు పనిచేస్తారు అని అనుకుంటే ఇంకొకడి నుండి పనిచేస్తారు. అదేమిటది. నా నుండి పనిచేసేవాడు నీ నుండి కూడా పని చేస్తున్నాడా! నాకు చెప్పలేదంటే! ఆయన చెప్పడు. ఎప్పుడు ఎవరినుండి పనిచేస్తాడో నీకు చెప్పడం అనే obligation ఏమన్నా వుందా ఆయనకి! ఏం లేదు. అందుకని మాస్టరుగారు ఎప్పుడు ఎవరి ద్వారా అయినా పనిచేయవచ్చు. అదీ అనుగ్రహం అంటే. There are no rules. There are no

conditions. There are no regulations for HIS working. అందుచేత నువ్వెవిడివి మధ్యలో ఆంక్షలు పెట్టడానికి? ఆంక్షలు వద్దన్నాడు. చూస్తూండు. నీకు ఇష్టమైతే ఈ మార్గంలో ప్రయాణించు అని చెప్పారు. నీకు విశ్వాసం ఉంటే ప్రయాణం చెయ్యి. ఆ విశ్వాసం కూడా నేనే కల్పిస్తాలే అని చెప్పారు. అందుచేత Karma is neither postponed nor purged but it is neutralised. ఎలా అని అడక్కు. ఎందుకంటే ఎలాగైనా అవ్వచ్చు. ఎలా అవ్వచ్చు అంటే ఒక్కోసారి కలలో కూడా ఆ కర్మానుభూతి కొన్ని క్షణాల్లో అనుభవింప చేసేస్తారు మాస్టరు గారు. లేచింతర్వాత అది కలేగా! నిజం అనిపించదు కదా! 'ఉద్ధవా కల కనుచుంటివా' అని మాస్టరు గారు 'పురుషమేధం'లో ఒక వాక్యం రాశారు.

నాకు కలలో కూడా నువ్వే ఉన్నావ్, అంటాడు ఆయన అంతకంటే. నువ్వొక పిచ్చివాడివంటాడు. నువ్వుకాదా, అంటాడు ఉద్ధవుడు. పిచ్చయినా ఫర్వాలేదులే నీ పిచ్చికదా! అన్నాడు పైగా. చాలా అద్భుతమైన పుస్తకం పురుషమేధం, అందుకు సందేహం లేదు. 'మంద్రజాలం, పురుషమేధం, పురాణపురుషుడు' ఈ పుస్తకాల్లోని వాక్యాలు రాయగలమా! మనం రాయలేము. 'నేనే రాసానా' అనిపిస్తోందోయ్, అన్నారు మాస్టారులాంటివారే. 'మంద్రజాలం' అనే పుస్తకం హిందీలో రాయించ డానికి మేమొకరింటికి వెడుతుండేవాళ్ళం. తిరిగి వస్తున్నప్పుడు రోజూ మాస్టరుగారు అంటూండే వారు, ఎంత ఆలోచించినా ఇది నేను రాసినట్లు అనిపించడంలేదోయ్ అని. మరి ఆ వాక్యాలు అసలు మనం అలా నిర్మాణం చేయలేం. అటు

వంటి వాక్యాలు అవి. అలా మనం మాస్టరుగారిని విశ్వసించడం, మనముందుకు వచ్చిన కర్తవ్యాన్ని నిర్వహించడం, ఇంతే! ఇంతకన్నా మరేంలేదు. అలా చేసుకుంటూంటే దాని అవగాహన అవుతూ ఉంటుంది. ఇది విచికిత్స చేయకుండా రుచి చూడడం పెట్టుకోవాలి. మీకు శాస్త్రం కావాలంటే ఆయన శాస్త్రం తెలుపుతాడు. ఉపనిషత్తులు కావాలంటే ఉపనిషత్తులు వివరించి పెడతాడు. ఏది, ఎందుకు మనలో విశదీకరిస్తున్నాడో ఆయనకే వదిలెయ్యండి. మన జీవితమే ఆయనకి వదిలెయ్యండి. మొత్తం జీవితం అంతా నీదే, నడిపించు, అని చెప్పిచూడండి! ఆ వైభవం ఎలా ఉంటుందో చూడండి. అలా కృష్ణుని పరిపూర్ణంగా నమ్మినవారు అలాంటి ఆనందంలో జీవించారు. అలా మాస్టర్ సి.వి.వి. స్పర్శ M.N.

గారిని అంతటివాణ్ణి చేసింది. మాస్టరుగారిని అంతటివారిని చేసింది. అందుచేత మనకు అదీ మార్గం. ఆ విధంగా మనం సాగి వెళ్ళాల్సి ఉంటుంది.

కర్మ లోపల అట్టలు కట్టేసి ఉంటుంది. దాన్ని బాగా గీకి మళ్ళీ క్రొత్త రంగు బాగా పట్టుకోవా లంటే వేసుకోవాలి. Kronos అనే ఒక Serpant ఉన్నదని గ్రీక్ దేశీయులు రాసుకున్నారు. కాల సర్పము. Kronos అంటే అసలు కదలుతున్నట్లే తెలియదుట. మనం ముసలివాళ్ళం అవుతున్నట్లే తెలియదు. అయిపోతుంటాము కదా! ఊళ్ళో వాళ్ళంతా మీలో ముసలి కళ పడ్డదంటే అప్పుడు కాస్త నమ్ముతాము. ఎప్పుడు పడ్డదీ, ఎలా పడ్డదీ మనకి తెలియదు. పసివాడు కుర్రవాడు ఎప్పుడు అయ్యాడు? కుర్రవాడు ముసలి వాడయ్యాడు

అంటారు. నువ్వు చచ్చిపోయావంటారు. ఎవరూ? నువ్వు చచ్చిపోయాక అటునుండి కొంతమంది వచ్చి చెప్తారు, అప్పటి వరకు నీకు తెలియదు నువ్వు చచ్చిపోయావని. జరుగుతున్నప్పుడు తెలియదు. అదే గుహలో serpant K looses its skin. అన్ని పాములూ అలా కుపసాలు వదల్లేవండి. కొన్ని పాములే వదలగలవు. మనం శరీరం వదలగలమా? అది మనల్ని వదిలేస్తుంది. ఇహ నువ్వు నాకొద్దని జీవుడు దేహం వదిలేస్తే మనం చస్తాం. యోగి 'చాలా సంతోషం. ఇన్నాళ్ళు నాకు పనిచేసావ్' అని కృతజ్ఞతలు చెప్తూ వీడ్కోలు చెప్పి వెళ్ళిపోతాడు. యోగికి మామూలు మనిషికీ తేడా ఏమిటి? తను శరీరాన్ని వదిలెయ్యగలడు. మనల్ని శరీరం వదిలేస్తుంది, విసర్జిస్తుంది. ఏమిటి తేడా అంటే? యోగికి అక్కడ కర్మ లేదు.

యోగాగ్ని దగ్ధ కర్ముడు యోగీశ్వరుడు. యోగంలో చేసిన తపస్సు ద్వారా పుట్టిన అగ్ని చేత సమస్త కర్మలూ దగ్ధం చేసుకొనేవాళ్ళు యోగులని భాగవత పద్యం చెప్తున్నది.

*'యోగాగ్నిదగ్ధకర్ములు*
*యోగీశ్వరు లే మహాత్ము నొండెఱుఁగక స*
*ద్యోగవిభావితమనముల*
*బాగుగ వీక్షింతు రట్టిపరము భజింతున్.'*

అని ఉన్నది. యోగీశ్వరుల కర్మ అంతా దగ్ధమై ఉంటుంది కనుక వాళ్ళు ఇంటిలో ఉన్నట్లు శరీరంలో ఉంటారు. ఎప్పుడు కావాలంటే అప్పుడు లోపలికి వెళ్ళిపోతుంటారు. ఎప్పుడు కావాలంటే అప్పుడు బయటకు వస్తుంటారు. కావాలంటే ఇంకోళ్ళింటికి కూడా పరకాయ ప్రవేశంగా వెళ్ళి

పోతుంటారు. అవీ దివ్య సర్పాలు. మహాత్ములు, యోగులు దివ్య సర్పాల్లాంటివారు. అంటే నాగులే! నాగు కుపసం వదిలేస్తుంది. బురదపాములు, కట్ల పాములూ కుపసాలు వదల్లేవు. ఒక్క నాగు పామే కుపసం వదలగలదు. కుపసం వదిలిన తర్వాత పామును చూస్తే ధగధగ లాడుతూం టుంది. ఈ రోజుల్లో పాముని చూసిన వారెవ రున్నారూ? మా చిన్నతనంలో పాములు అక్క డక్కడ కనిపించేవి. అలా పూల మొక్కలమీదా, అక్కడా పాము ఆకారంలో పెళుసుగా పొర మాత్రం ఉంటుంది. అదలా వదిలేసి వెళ్ళి పోతుంది. దాన్ని తెచ్చుకొని పవిత్రం అని ఇంట్లో దాచుకొనేవారు. మహాత్ముల శరీరం సమాధి చేసి దండం పెట్టుకుంటున్నాం కదా! (మహాత్ముల శరీరాలు మాత్రమే అలా సమాధి చేయాలి,

అందరివీ కాదు. మనం కూడా సమాధులు కట్టించేసుకుందాం అంటే అవదు.) నా సమాధి నుండియే నీకు సమస్త కోరికలూ సిద్ధించును గాక! అని అన్నాడు ఓ మహాత్ముడు. అలా నేను ఎందుకు, నా కుపసం చాలు. అలాటిదే ఈ సర్పం కూడా! మనకి కూడా దేహాత్మ భావన ఉన్నంత వరకు దేహం పట్టి ఉంచుతుంది. ఆత్మ భావనలోనికి ప్రవేశించాం అనుకోండి దేహం నెమ్మదిగా విడుదలనిస్తుంది. దేహం పట్టేసిం దనుకోండి వెళ్ళేప్పుడు ఒంటికి అన్నీ గాయాలే అయిపోతాయి. చెక్కి తీసుకెళ్ళాల్సి వస్తుంది. పచ్చి అరటికాయ తొక్క తీయండి. తీయగలరా! తొక్క తీయాలంటే కత్తి వాడాల్సి వస్తుంది. అరటిపండు తొక్కతీయడానికి కత్తి అక్కర్లేదుగా! ఏమిటి తేడా? ఇది పండింది, అది పండ లేదు.

పండితే శరీరానికీ, లోపల ఉండే జీవుడికి కలిసి ఉండడం అయితే ఉందిగానీ అతుక్కొని లేదు. తుమ్మజిగురులేం లేవు. మనకి అంత జిగురు ఉంది కనుకనే Fevicol, Fevifix లాంటివి వచ్చాయి. మనకి ఎంత జిగురు ఉంటే మన మార్కెట్లో కూడా అంత జిగుర్లు వస్తుంటాయి. భక్తి ఎంత ఉంటే అంత జిగురు. అసలు భక్తిలో జిగుర్లు ఏమిటండి? భక్తి పెరిగే కొలదీ జిగురు పోవాలిట. ఈ పద్ధతిలో యోగమార్గ మనండి, భృక్తరహిత రాజమార్గ మనండి అందులో మనము ముందుకు వెళుతుంటే నెమ్మదిగా మనలోని మనోమయ పొరలు, కామమయ పొరలు, భౌతికమైన పొరలు మూడూ, విడిపో తుంటాయి. అంటే అరటిపండు వలవడం. పండు వలిచినప్పుడు లోపల పండుకి, తొక్కకీ

అంత మరీ భయంకరమైన సంబంధం లేదు. ఉందని తెలిస్తే కత్తి వాడేస్తాం. మన Past కర్మ మన శరీరపు కోశాలను అంటిపెట్టుకుంటుంది. ఎప్పుడైతే నీ మనోమయ, కామమయ కోశాలకి జిగురు పోయిందో అప్పుడు సులభంగా కర్మ కూడా వచ్చేస్తుంది. అందుచేత నా యోగంలో ప్రవేశించినవాడు ముందు నాకేం కావాలి, అనేది ఆలోచించడం మానెయ్యండి, మన చుట్టూ ఉండే వాళ్ళకి ఏం కావాలో ఆలోచించండి, అని చెప్పారు. దాంట్లోనే Karma అంతా అయి పోతుంది. మనకి ఏంకావాలో గుర్తుంటే కర్మ పెరుగుతూంటుంది. ఇతరులకి ఏం కావాలో గుర్తించి దానికి అనుగుణంగా మనం పని చేస్తుంటే కర్మ క్షాళన అయిపోతుంది. ఇతరులకి సేవ చేస్తే మన కర్మ క్షాళన అవుతుందని సేవలో

మనం మమకారం చూపించా మనుకోండి. 'మా తే సంగోఽస్త్వ కర్మణి' అన్నాడు కృష్ణుడు. సేవా కార్యక్రమాలు చేసేవాడు కూడా వాడిచుట్టూ ఏర్పడినవి వాడివే అనుకుంటాడు కదా! అను కుంటే కర్మ తీరదు. మనదేముందీ మనదేం లేదు. అంతా దైవం అనండి, గురువనండి... ఆయనదీ! మన వరకు చక్కగా నిర్వహించాం. దానిమీద మోహం వద్దు. నా వల్ల వాడు బాగు పడ్డాడనే భావన నీకుండ కూడదు, వాడికుంటే ఉండవచ్చు గాక. చిత్ర మేమంటే సహాయం చేసినవాడికి సహాయం చేసా మని గుర్తుంటుంది. సహాయం పొందినవాడు మహాయోగి. వాడికి అస్సలు గుర్తుండదు. అంతా తల్లకిందులు కదా! అంతా మనమే గుర్తు పెట్టుకుంటాం వాడికి మన మేమేం చేసామో! అలా గుర్తుపెట్టుకుంటే కర్మేం

తీరదు. అందుకే అంతగా, చేసే పనులకి అతుక్కు పోక, అని శ్రీకృష్ణుడు చెప్పాడు. ఆ విధంగా మాస్టరుగారి యోగమార్గంలో లేచిన దగ్గరనుండి ఎవరికి ఏమేం చేయాలో చూడు, అంతే! వాడికి ఏం చేసినా హితవుగా చేయాలి. ఎదుటివాడికి, సహకారం హితవుగా చెయ్యి. వాడి శ్రేయస్సుకు చెయ్యి. వాడి ప్రేయస్సుకు చేయకు. అలా చేసు కుంటూ పోయారనుకోండి పొరలన్నీ వూడి పోతాయి. పొర లూడిపోతే అయిపోయింది. అందుకని ఇదొక ధ్యానము. అప్పుడు, కుపసం వదిలిన పాము శరీరంలా, ధగధగ లాడుతున్న నీ శరీరం నీకు కనిపిస్తుంది. అదే సూక్ష్మశరీరం. 'సూక్ష్మదేహము అమరత్వము సాధించి, జీవు లలో గ్రహగతులను చక్కచేసి, పరమగురువు అవతరించె సి.వి.వి' అని మనకి పాట. అందు

చేత సూక్ష్మదేహానికి అమరత్వము అందించి, ఈ దేహం నుండి దానిని విడదీసి మన పనంతా చెయ్యడానికి ఆయన దిగి వచ్చినట్లుగా మాస్టరు గారి యోగం గురించి మనం చెప్పు కుంటూంటాం.

...... స్వస్తి ......

## OTHER BOOKS THROUGH
## DR. SRI K. PARVATHI KUMAR

The following books are available in: English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (HI) and Kannada (K) languages.

| | | |
|---|---|---|
| 1. | Master C.V.V. (Birthday Message) | T |
| 2. | Master C.V.V. Noothana Yogamu | T |
| 3. | Master C.V.V. Yogamu | T |
| 4. | Master C.V.V. - May Call - 1 | E/G/S |
| 5. | Master C.V.V. - May Call - 2 | E |
| 6. | Master C.V.V. Saturn Regulations | E |
| 7. | Varuna Graha Prabhavam | T |
| 8. | Master C.V.V. The Initiator - Master E.K. The Inspiror | E |
| 9. | The Aquarian Master | E/G/S |
| 10. | Listening to Invisible Master | E/G/S/F/H |
| 11. | Lord Maitreya-The World Teacher | E/G/S/F/H |
| 12. | Himalaya Guru Parampara | T/Hi |

| | | |
|---|---|---|
| 13. | Maitreya Maharshi Bodhalu | T/Hi |
| 14. | Maruvu Maharshi Bodhalu | T/Hi |
| 15. | Devapi Maharshi Bodhalu | T/Hi |
| 16. | Omkaram | T |
| 17. | Pranayamam | T |
| 18. | Prayers | E/G/S |
| 19. | Gayatri Mantra - Avagahana | T |
| 20. | Bharateeya Sampradayamu | T/Hi |
| 21. | Shodasopachara Pooja - Avagahana | T |
| 22. | Sri Dattatreya | E/G/S/T/Hi |
| 23. | Sri Shiridi Sai Sayings | E/G/S/T/Hi |
| 24. | The Teachings of Sanat Kumara | E |
| 25. | Doctorine of Eternal Presence | E |
| 26. | Cow ('Govu' Mahatyam Vivarana) | E/T/K |
| 27. | Good Friday | E/G/S/F/H |
| 28. | The White Lotus | E/G/S |
| 29. | Wisdom Buds | E/S |